ప్రజాశక్తి

మంగళవారం 25 నవంబర్ 2025 5

పార్వతీపురం మన్యం

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్య, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫోటోలతో ఈనెల 26వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని పిఒ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నం, విజయవాడ తిరుపతి కేంద్రాల్లో ఉచిత శిక్షణ ఉంటుందని పిఒ తెలిపారు. కుటుంబ ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలని తెలిపారు.

మన్యం గడ్డపై పుస్తక మహోత్సవం

- వందకు పైగా ప్రచురణ సంస్థలు, వేలాది పుస్తకాలు
- నేటి నుంచి 5వరకు ప్రదర్శన, అమ్మకాలు
- సాయంత్రం వేళ సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలు
- జెవివి ఆధ్వర్యాన మూఢనమ్మకాలపై ప్రయోగాలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభం

పుస్తక మహోత్సవానికి సిద్ధం చేస్తున్న బుక్‌స్టాళ్లు

ప్రజాశక్తి-పార్వతీపురం

మన్యం జిల్లా ఏర్పడిన తరువాత తొలిసారి పార్వతీపురం గడ్డపై పుస్తక మహోత్సవం జరుగనుంది. పుస్తకాల సువాసనతో, జ్ఞానోత్సాహంతో, సాహిత్య సోయగాలతో ప్రారంభమవుతున్న ఈ పుస్తక మహోత్సవం పార్వతీపురం నగరానికి ఒక సాంస్కృతిక సందర్భంగా నిలవనుంది. శాస్త్ర, సాంకేతిక, సాంస్కృతిక, సాహితీ, విద్యా, వైజ్ఞానిక రంగాలకు చెందిన పుస్తకాలు ఈ ఉత్సవంలో లభించనున్నాయి. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ ఆధ్వర్యాన మంగళవారం నుంచి డిసెంబర్ 5 వరకు పది రోజులు పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ పుస్తక మహోత్సవం జరుగనుంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ఈ ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు. పుస్తకాలపై ప్రేమ, చదువుచ, సంస్కృతి, జ్ఞాన వికాసం వంటి విలువలను ప్రజల్లో మరింత బలపరచడం ఈ మహోత్సవ లక్ష్యం. ఈ పుస్తక మహోత్సవంలో వందకు పైగా ప్రచురణ సంస్థలకు చెందిన సుమారు 50వేల పుస్తకాలు ఈ ప్రదర్శనలో దొరుకుతాయి. పిల్లల నుంచి పెద్దల వరకు, విద్యార్థుల నుంచి అధ్యాపకుల వరకు, పాఠకుల నుంచి రచయితల వరకు అందరికీ అనువైన పుస్తకాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉండనున్నాయి. రచయితల సంభాషణలు, కవితా వేదిక, కథా వేదిక, పిల్లల కోసం సైన్స్ డెమోలు, పాఠశాల విద్యార్థుల ప్రతిభా కార్యక్రమాలు, పుస్తక ఆవిష్కరణలు వంటి అనేక ఆకర్షణలు సందర్శకుల కోసం సిద్ధంగా ఉన్నాయి. పుస్తకాల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు, చదువును ఒక అలవాటుగా మార్చేందుకు, కుటుంబాలు కలిసి పుస్తకాలతో సమయం గడపాలనే ఉద్దేశంతో ఈ మహోత్సవం ప్రజలకు అందుబాటులోకి వస్తోంది. పార్వతీపురం ప్రజలు, విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

ఇప్పటికే పుస్తక మహోత్సవం గురించి పట్టణంలో విస్తత ప్రచారం చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాలకు వెళ్లి సంస్థ ప్రతినిధులు పుస్తక మహోత్సవం ఆవశ్యకత గురించి వివరించారు. జిల్లాలో వున్న కవులు, రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సహకారంతో ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.

సాహితీ ప్రియులకు కనువిందు చేసే కళారూపాలు ప్రదర్శించనున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు కూడా నిర్వహించనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచం దూసుకుపోతున్న తరుణంలో ఇంకా సమాజంలో మూఢనమ్మకాల జాడలు కనిపిస్తునే వున్నాయి. ముఖ్యంగా మన్యం జిల్లా లో వున్న ఏజెన్సీ గ్రామాల్లో మూఢనమ్మకాల జాడలు ఎక్కువగా వున్నాయి. చేతబడి, దెయ్యాలు, భూతాలంటూ గిరిజన గ్రామాల్లో ఈనాటికీ ప్రజలు కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి తరుణంలో పుస్తక మహోత్సవాన్ని, సాంస్కృతిక ప్రదర్శనలను విద్యార్థులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

పుస్తక ప్రదర్శనను జయప్రదం చేయాలి

మంగళవారం నుంచి పదిరోజుల పాటు మన్యం పుస్తక మహోత్సవం జరుగనుంది. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నాం. రోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు పుస్తక ప్రదర్శన, అమ్మకాలు సాగనున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు జెవివి ఆధ్వర్యాన వివిధ ప్రయోగాలు జరగనున్నాయి. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి .

కిరణ్,
విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రతినిధి

పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలి

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్నమంత్రి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకరరెడ్డి, అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

పిల్లల్లో పౌష్టికాహారం, పరిశుభ్రత లోపం లేకుండా చూడాలని, అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల బాలికలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వన్ స్టాప్ సెంటర్ ఆవరణలో బేటీ బచావో... బేటీ పఢావో కార్యక్రమం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే కార్యకర్తల లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో ముస్తాబు కార్యక్రమం జరుగుతుందని, దాన్ని పక్కాగా చేపట్టాలని అన్నారు. ప్రతీ పిల్లవానికి వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే ప్రతి కేంద్రంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి సున్నితమైన అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 217 మందికి అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలకు గ్రాడ్యుటి సౌకర్యం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన పట్ల ప్రతిజ్ఞ చేయించి, పదోన్నతి పత్రాలను కలెక్టర్‌తో కలిసి మంత్రి కార్యకర్తలకు అందజేశారు.

అనంతరం కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీల పనితీరు బాగుందని కితాబిచ్చారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా పిల్లలకు మంచి అలవాట్లను ప్రాథమిక స్థాయి నుంచే నేర్పించాలని అన్నారు. పిల్లల్లో అక్షరజ్ఞానంతో పాటు పరిశుభ్రత కూడా అంతే అవసరమని అన్నారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ జిల్లాలో 217 మందికి మినీ అంగన్వాడీ కార్యకర్తల నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించి ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పదోన్నతి పత్రాలు పొందుతున్న 217 మంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డైరెక్టర్ శేఖర్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, డిసిపిఒ ఎ.సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ముస్తాబు' సిఎం హర్షం

జిల్లాలో అమలు చేస్తున్న 'ముస్తాబు' కార్యక్రమం అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేసినట్లు మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. పిల్లల పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల కలెక్టర్ ప్రభాకర రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవను ఆమె కొనియాడారు. ముస్తాబు కావడానికి పిల్లలు ఎక్కువ ఇష్టపడతారని, దీంతో పరిశుభ్రత పట్ల అవగాహన పెరిగి నిత్యం పరిశుభ్రంగా ఉంటారని అన్నారు.

ఫీజు చెల్లింపు తేదీల్లో మార్పు లేదు : డిఇఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

2026 మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు తేదీల్లో ఎలాంటి మార్పు లేదని జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల నామినల్ రోలు, సంబంధిత పాఠశాలల యుడైస్‌లో క్షుణ్ణంగా పరిశీలించి, పరీక్షల ఫీజు చెల్లించి ఒకే చేయాలని సూచించారు. నామినల్ రోల్‌లో ఎటువంటి తప్పులు లేకుండా పరిశీలించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో టెన్త్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష రుసుం ప్రభుత్వం నిర్దేశించిన రుసుం కన్నా ఎక్కువ వసూలు చేస్తే ఆయా పాఠశాలలపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలకు, ఫీజుకు సంబంధించి ఏమైనా అనుమానాలున్నా, అలాగే యు డేస్ సంబంధించిన వివరాలపై ఎటువంటి సందేహాలున్నా జిల్లా స్థాయి గ్రీవెన్స్ సెల్ కార్యాలయ పని వేళల్లో ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

అలాగే 2024లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ నందు రూ.300 చెల్లించి పోయిన సబ్జెక్టులకు మళ్లీ పరీక్షలు రాయవచ్చుని సూచించారు. 2025 సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మాత్రమే పాత సిలబస్ ప్రకారం పరీక్షలు రాయడానికి అవకాశం ఉందన్నారు. నామినల్ రోల్ తయారీ విధానంలో ఎటువంటి తప్పులు జరగకుండా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాగ్రతలు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

పిజిఆర్ఎస్‌కు 92 ఫిర్యాదులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలు వెంటనే పరిష్కరించబడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఎన్నో ఆశలతో అర్జీలు తీసుకొని సమస్యల పరిష్కారం కోసం వస్తారని, వారి నమ్మకాన్ని నిజం చేయాలని అన్నారు. అర్జీల పరిష్కారం వివరాలను సంబంధిత పట్టిక ద్వారా సమగ్ర సమాచారం అందజేయాలని సూచించినట్లు గుర్తుచేశారు. ఏ వారంలో వచ్చిన అర్జీలన్నీ ఆ వారంలోగా పరిష్కారం కావాలని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 92 వినతులు అందాయి.

వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ

కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తనకు కాలు లేనందున నడవలేని పరిస్థితిలో ఉన్నానని, కావున తనకు ట్రైసైకిల్ మంజూరు చేయాలని వీరఘట్టం మండలం బిటివాడ నుంచి కనకల అప్పలనాయుడు అర్జీని ఇచ్చారు. అదేవిధంగా సాలూరు మండలం కర్రి వీధి నుంచి కర్రి పరశురామ్ అర్జీని అందిస్తూ తనకు వినికిడి సమస్య ఉందని, కావున వినికిడి పరికరాన్ని మంజూరుచేయాలని కోరారు. వాటిపై కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి ప్రతినిధిని ఆదేశించి వాటిని మంజూరు చేశారు. కార్యక్రమంలో జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పిజిఆర్ఎస్‌కు 97 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 97మంది గిరిజనులు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ఐటిడిఎ ఎపిఒ ఎస్‌వి గణేష్, ఇఇ రమాదేవి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, పిఆర్ డిఇ రాధారాణి, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, డిపిఎం రమణ, డిఇ నాగభూషన్ ఆర్అండ్‌బి డిఇ జగన్నాథ రావు, పశు సంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, భామిని జెఇ సత్యం, సూపరింటెండెంట్ అప్పారాఉవ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుకీ న్యాయం జరిగేలా చూస్తాం : ఎఎస్‌పి

పార్వతీపురం టౌన్ : అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను పరిశీలించారు. ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలు ఉన్నట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో 4 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతయిన యువకుల మృతదేహాలు లభ్యం

ఒడ్డుకు చేరిన ప్రతాప్, శరత్ మృతదేహాలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామ్ నదిలో స్నానానికి దిగి ప్రమాదానికి గురై గల్లంతయిన ముగ్గురు యువకుల మృతదేహాల ఆచూకీ సోమవారం లభ్యమైంది. రబ్బరు డ్యాం వద్ద ఆదివారం సాయంత్రం ఒకర్ని కాపాడేందుకు మిగిలిన ఇద్దరు దిగి ప్రమాదం బారినపడి ముగ్గురు యువకులు గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. ఆదివారం రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలకు కొంత ఆటంకం కలగడంతో సోమవారం ఉదయం నుంచి రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది నదీ పరివాహక ప్రాంతాల్లో గాలింపు చర్యలు ముమ్మరంగా చేశారు. ముందుగా నదిలో గల్లంతయిన శరత్‌ను కాపాడేందుకు దిగిన ప్రతాప్, గోవింద నాయుడు ముగ్గురు గల్లంతయ్యారు. దేవునికొంప సమీపంలో నాగావళి, జంఝావతి నదుల వద్ద ఒడ్డున సోమవారం ఉదయం రెండు మృతదేహాలను స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకునే మృతదేహాలను పరిశీలించగా, వీరు ప్రతాప్, గోవింద నాయుడుగా గుర్తించారు. అనంతరం అధికార సమక్షంలో మృతదేహాలను పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముందుగా గల్లంతైన శరత్ మృతదేహం కోటిపాం గ్రామం వద్ద ఉన్న కారిరేవే సమీపాన లభ్యమైంది. ఈ ఘటన జరగడంతో సివిని గ్రామంతో పాటు పరిసర ప్రాంతమంతా తీవ్ర విషాదఛాయలు అమలు కున్నాయి. ఎస్సై కె.నీలకంఠం, అగ్నిమాపక, రెవిన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

గల్లంతైన మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి

పార్వతీపురం : జంఝావతి రబ్బరు డ్యాంలో పడి ముగ్గురు యువకులు గల్లంతైన సంఘటనపై రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి మంత్రి సంధ్యారాణి ఆరా తీశారు. ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. గల్లంతైన యువకుల వివరాలను జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల్లో రెండు మృతదేహాలు లభ్యం కాగా, మరొకరి కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రబ్బరు డ్యాం పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, ఫెన్సింగ్ వంటి రక్షణ చర్యలు వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

ఒక ఇంటినీ మంజూరు చేయని ప్రభుత్వం : జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో మంజూరైన ఇళ్లకు ఇటీవల టిడిపి మంత్రులు, ఎమ్మెల్యేలు అవే ఇళ్లల్లో మళ్లీ ప్రవేశాల పేరుతో సంబరాలు నిర్వహించారని ఎద్దేవా చేశారు. ఇటీవల మన్యం జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం జరిగిందని, గత సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాలే ఈసారి కూడా చర్చకు వచ్చాయన్నారు. మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రికి విద్యుత్ సరఫరా కోసం నిధుల్లేక ప్రారంభించ కుండా వదిలేశారని చెప్పారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ఆసుపత్రిని మంజూరు చేయించారని చెప్పారు. విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేయడానికి నిధులు లేక వంద పడకల ఆసుపత్రిని వదిలేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ విషయం అద్దం పడుతోందని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. అత్యంత వెనుకబడిన మన్యం జిల్లాలో మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటీకరిస్తుంటే జిల్లా ఎమ్మెల్యేలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇటీవల జిల్లాలో గల గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగించాయని చెప్పారు. ఇంతవరకు ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను గాని, కొత్త రేషన్ కార్డు గాని మంజూరు చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదు సెంట్ల భూమి ఉన్నవారికి రైతు భరోసా మంజూరైందని, టిడిపి పది సెంట్ల భూమి వున్నవారికి కూడా అన్నదాత సుఖీభవ కింద సాయం చేయలేదని చెప్పారు. ఇనాం భూములున్న వారికి కూడా మంజూరు చేయలేదని చెప్పారు. వైసిపి డిమాండ్ చేసిన తర్వాత రెండో విడత ఇనాం భూములకు అన్నదాత సుఖీభవ కింద నగదు బదిలీ జరిగిందని చెప్పారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ అధికారపార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఆఅవాస్తవాలు, అభూత కల్పనలతో ప్రజల్ని అధికారపార్టీ ఎమ్మెల్యే లు, మంత్రులు భ్రమల్లో ముంచుతున్నారని చెప్పారు.

రైతుల పంటలకు గిట్టుబాటు ధర ఏదీ: రాజన్నదొర

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు.. పత్తి క్వింటాకు మద్దతు ధర రూ.8వేలు ఉంటే రైతులు రూ.5400కు అమ్ముకోవాల్సి వస్తోందని చెప్పారు. మొక్కజొన్న కొనే నాధుడు లేక రైతులు నష్టానికి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు జరిగిన నష్టానికి ఇంతవరకు పరిహారం చెల్లించ లేదని చెప్పారు. ఉచిత పంటల బీమా అమలు చేయడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి జిల్లా ప్రచార విభాగం కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం తొలగించాలి

బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలి
వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలు సరికాదని, ఆపరేషన్ కగార్ పేరు బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపివేయాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఐ ఎంఎల్ నాయకులు పోల ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు కొల్లి గంగునాయుడు, కె.మన్మధరావు, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి టీ జీవ తదితరులు మాట్లాడారు. ఇటీవల దేశంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధం పెరిగిందని, ప్రజాస్వామ్య విలువలను కూడా పాలకవర్గాలు కాల రాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీల్లో ఉన్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే కుట్రలో భాగంగా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టు నాయకులపై బూటకపు ఎన్కౌంటర్లకు పాల్పడడం అత్యంత హేయమైన చర్యని విమర్శించారు. చట్ట వ్యతిరే కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడినట్టు రుజువైతే చట్ట ప్రకారం శిక్షించాలి తప్ప చట్టానికి అతీతంగా పాలకులు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రెండూ ప్రజాస్వామ్య హక్కులను కాల రాస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగా ప్రజాసంఘాలు నిర్వహించే ప్రజాస్వామ్యయుత నిరసన కార్యక్రమాలకు కూడా అనుమతులు పేరుతో నియంత్రిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన భావ స్వేచ్ఛను హరించేలా కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు ఢిల్లీ రైతాంగ పోరాటాన్ని కూడా ఇదే విధంగా అణిచివేశారని, ఇప్పుడు ఏజెన్సీలోనూ ఉగ్రవాదం పేరుతో మావోయిస్టు నాయకులను బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో మట్టు పెట్టడం దుర్మార్గమని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంతృత్వ పోకడలను విడనాడాలని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని, కార్పొరేట్ శక్తులకు ప్రజల సంపద కట్టబెట్టే చర్యలు మానుకోవాలన్నారు. లేనిచో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పవని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు పోరాటం చేస్తూనే ఉంటాయని, ఎలాంటి నిర్బంధానికి భయపడే ప్రసక్తి లేదని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు వైమన్మధరావు, బివి రమణ, జివి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కద్రక రామస్వామి, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు పి.రమణి, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గ్రామీణ పేదల సంఘం నాయకులు జి.సూరయ్య, బి.నరసింగరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి.సూరిబాబు, యువజన సంఘం నాయకులు కృష్ణ తదితరులు మాట్లాడారు.

జె.గోపాలపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రి సచివాలయం పరిధి జె.గోపాలపురంలో సోమవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శుభారాతమణి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో గంజాయి సాగు తగ్గు ముఖం

గత ఏడాది 867 కేసులు నమోదు : డిఐజి

పాలకొండలో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న డిఐజి గోపీనాథ్ జెట్టీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉత్తరాంధ్ర ఏజెన్సీలో గంజాయి సాగును ఈ ఏడాది గణనీయంగా తగ్గించగలిగామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ కార్యాలయానికి సోమవారం వచ్చిన సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీలో 11వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని, దీన్ని పెద్ద ఎత్తున అదుపులోకి తీసుకురాగలగామని తెలిపారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది 93 ఎకరాలకు గంజాయి సాగు తగ్గుముఖం పట్టిందన్నారు. ఎఒబి సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా గంజాయి రవాణా జరుగుతుందన్నారు. గత ఏడాది 867 గంజాయి కేసులను నమోదు చేసి 20467 మందిని అరెస్టు చేశామన్నారు. 65 మందిపై పిడి యాక్ట్ నమోదు చేశామన్నారు. గంజాయితో రవాణా అవుతున్న 500 వాహనాలను సీజ్ చేశామన్నారు. పోలీస్ శాఖ ద్వారా సంకల్పం పేరున గంజాయికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ 12 లక్షల మంది విద్యార్థులు, యువత, మహిళా సంఘాలు తదితర గ్రూపులకు చైతన్యవంతులుగా చేశామన్నారు. అభ్యుదయం పేరున గంజాయి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అన్ని జిల్లాలను కలుపుతూ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఫోక్సో కేసులు తగ్గాయని సంతృప్తి వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై పజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మన్యం జిల్లాలో క్రైమ్ రేటు తగ్గిందని ప్రమాదాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదాలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై చర్యలు ఉంటాయని డిఐజి హెచ్చరించారు. ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజికి సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఆయన వెంట ఎస్పీ మాధవ్ రెడ్డి, పాలకొండ డిఎస్పి రాంబాబు, ఎల్విన్ పేట, చిన మేరంగి సిఐలు హరి, తిరుపతిరావు, ఎస్ఐ బి.శివప్రసాద్ తదితరులు ఉన్నారు. డిఐజి గోపీనాథ్ జెట్టికి యాంత్రోపాలజిస్ట్ రచించిన పుస్తకాన్ని ఎల్విన్‌పేట సిఐ హరి అందజేశారు.

పెట్రోలు బంకు ప్రారంభం

పాలకొండ : పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం పక్కన పెట్రోల్ బంకును రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ ప్రజలకు దగ్గరయ్యే కార్యక్రమాల్లో ఇదొక భాగమన్నారు. సైబర్ నేరాలు అరికట్టడానికి ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. దీనికోసం తమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మద్యం సేవించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున మద్యంసేవించి వాహనాలు నడపరాదన్నారు. మాదకద్రవ్యాలైన గంజాయి నిరోధించడానికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. ఎక్కడైనా అటువంటి కార్యక్రమాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఎఎస్‌పి వెంకటేశ్వరరావు (అడ్మిన్), డిఎస్‌పి ఎం.రాంబాబు, సిఐ ఎ.ప్రసాద్ రావు ఎస్సై ప్రయోగమూర్తి తదితరులు ఉన్నారు.

టిటిడి దేవాలయాన్ని సందర్శించిన డిఐజి

సీతంపేట : స్థానిక టిటిడి దేవాలయాన్ని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి సోమవారం సందర్శించారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠాపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట మీదుగా వెళ్తుండగా శ్రీవారి దేవాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎస్‌పి, డిఎస్‌పి, స్థానిక ఎస్ఐ ఎస్ఐ వై.అమ్మన్నరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రయత్నించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన వాటిలో 90 శాతం అర్జీలు అదే రోజు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగని మొక్కుబడిగా ఫైలును ముగిస్తే ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి అర్జీ విధానపరంగా జరగాలని, అధికారులంతా ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ దరఖాస్తులపై అధికారులు ఇచ్చిన ఎండార్స్ మెంట్లను శాఖల వారీగా కలెక్టర్ ఆడిట్ చేసి సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీలకు ఇచ్చిన ఎండార్స్ మెంట్లు పక్కాగా వుండాలని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తప్పులను తెలుసుకొని, వాటిని సరిదిద్దుకోవాలని, తద్వారా నాణ్యమైన పరిష్కారం లభించగలదని కలెక్టర్ ఉద్బోధించారు. నాణ్యమైన పరిష్కారం లభించడం వలన అర్జీదారులు సంతృప్తి చెందాలని చెప్పారు. ఎండార్స్ చేసే ముందు అధికారులు పునః పరిశీలించుకోవాలని, అర్ధమయ్యే రీతిలో ఎండార్స్ ఉండాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారం వివరాలను సంబంధిత పట్టిక ద్వారా సమగ్ర సమాచారం అందజేయాలని అధికారులను ఆదేశించారు. మలేరియా కేసులు వచ్చాయంటే ఆ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సక్రమంగా జరగలేనట్లుగా గుర్తించాల్సి వస్తుందని, కావున అటువంటి కేసులు రాకుండా నీటి నిల్వలు, దోమలు గ్రుడ్లు పెట్టే ప్రాంతాలను జల్లెడ పట్టి ఆయిల్ బాల్స్ వేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సీతంపేట గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ వంటి కేసులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయినప్పటికీ కేసులు నమోదైతే సంబంధిత సెక్రటరీని బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 1 నుంచి రోడ్లపై చెత్త కనిపించరాదని, చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలకు సూచించారు.ఏ గ్రామంలో చెత్త కనిపిస్తే ఆ అధికారిని బాధ్యులను చేస్తామని అన్నారు. ప్రతి ఎంపిడిఒ వారి పరిధిలోని డోలి రహిత గ్రామాలు, పర్యాటక ప్రాంతాల వివరాలు, దేవాలయాలు, జలపాతాల వివరాలు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పిఎస్ జగన్నాథ్, ఎస్డిసిలు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, వ్యవయశాఖాధికారి అన్నపూర్ణ

'రైతన్నా మీకోసం' కరపత్రం విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతన్నా! మీకోసం, రైతన్న సేవలో... మన మంచి ప్రభుత్వం కరపత్రాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీనిపై విస్తృత స్థాయిలో ప్రచారం చేసి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన రైతులకు అందిస్తున్న సాయాన్ని అర్ధమయ్యేలా తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వం సూచించే మార్గదర్శకాల ద్వారా రైతులు అధిక లాభాలు పొందాలని కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఒక పంట కాకుండా బహుళ పంటలు వేసుకునేలా అదనపు ఆదాయంతో పాటు జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. అలాగే ఉద్యానవన రైతులు 90శాతానికి పైగా రాయితీ ఉన్న డ్రిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటను వేసుకొని ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆర్.అన్నపూర్ణ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.సత్యనారాయణ రెడ్డి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివ గణేష్ కుటుంబ సభ్యులకు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కొట్టు గుమ్మడకు చెందిన ఉదయాన శివగణేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ రూ.5లక్షల విలువ గల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్రియాశీలక సభ్యత్వం వల్ల ఎంతోమంది అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, వైశ్యకలింగ డైరెక్టర్ తూముల రమేష్, జనసేన జానీ, ఉదయాన చరణ్, తదితరులు పాల్గొన్నారు.

మావుడి సోదరులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీను, రాజన్నదొర

మావుడి సోదరులకు జెడ్‌పి చైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి -మక్కువ

ఇటీవల వయోభారంతో మావుడి సోదరులకు మాతృవియోగం కలిగిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) సోమవారం కుటుంబీకులను పరామర్శించారు. అరుణమ్మ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర, రెడ్డి సురేష్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -పాలకొండ

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు విఆర్ఎలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ విఆర్ఎలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని, ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. డిఎను జీతంతో కలిపి ఇవ్వాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయ సావిత్రికి అందజేశారు. కార్యక్రమంలో విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు, కార్యదర్శి గోపి, కోశాధికారి బి.తిరుపతిరావు, బి.దిలీప్, సరోజిని, కృష్ణ, రాజారావు తదితరులు ఉన్నారు.

పార్వతీపురం: విఆర్ఎ సమస్యలు పరిష్కారం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి జి కృష్ణారావు, నాయకులు మన్మధరావు,గొర్లి వెంకటరమణ ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ పేస్కేలు అమలు చేయాలని, వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ పోస్టులలో70 శాతం వీఆర్ఏల చేత భర్తీ చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్ మెన్ పోస్టులను ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా పూర్తిస్థాయిలో విఆర్ఎల చేత భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏవో జి ,శ్రీనివాస రావు కి వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో వీఆర్ఏలు గోవింద, సుధా, పవను, బాబురావు, శ్రీను, పార్వతి ,రూప, సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

కెవికె కార్యక్రమాలు రైతులకు ఉపయోగపడాలి

ప్రజశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాలు రైతులకు ఉపయోగపడేలా చేపట్టి ఆధునిక పద్ధతుల సాగు, సాంకేతిక విజ్ఞానం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రార్స్ చింతపల్లి ఎడిఆర్ డాక్టర్ ఎ.అప్పలస్వామి సూచించారు. సోమవారం ఆయన మండలంలో రస్తాకుంటుబాయిలో గల కెవికెను సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించి సాగు విధానాలు, పరిశోధన ఫలితాలు, రైతులకు చేరే విధానాలపై సమీక్షించారు. అనంతరం బిత్తరపాడు, సింగనాపురంలో నిర్వహించిన "రైతున్న మీకోసం" కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు. పంటల్లో రెట్టింపు దిగుబడులు పొందేందుకు శాస్త్రీయ పద్ధతులు, నేల ఆరోగ్యం, విత్తనాల నాణ్యత, నీటి వినియోగంపై సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాస్ రాజు, డాక్టర్ ఎం.అనంతవిహారి, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్రమైన బలిజిపేట ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బలిజిపేట బస్టాండ్ నుండి రోడ్డు చివర ధర్మా మెడికల్ షాప్ వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ రోడ్డుపై సుమారుగా 50 టన్నుల బరువున్న భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల రోడ్డు పాడైపోవడానికి అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్య నియంత్రణించాల్సిందిగా కోరుతున్నారు.

బలిజిపేట ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

జోరుగా కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలి వద్ద ఆ పార్టీ నాయకులు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలో 10 మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన 40 రోజులుగా నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపిలు, మండల వైసిపి అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు వెంకంపేట పంచాయతీ వై జంక్షన్ కూడలి వద్ద సోమవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలల్లో పది మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం పిపిపి విధానంలో ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ గత 40 రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని చేపడుతున్నామని వైసిపి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ బొమ్మి రమేష్, జడ్పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథం, వైసిపి సీనియర్ నాయకులు తీళ్ల శివున్నాయుడు, ఎంపిటిసి బడే రమణమ్మ, వైసిపి రాష్ట్ర ప్రచారకర్త బి.వాసు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజక వర్గ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

నిబంధనలు పాటించని రైసు మిల్లర్లపై కఠిన చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

నిబంధనలను ఉల్లంఘించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లయస్ మేనేజర్ కె. శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని రైసుమిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 104 రైస్ మిల్లులు ఉండగా, అందులో 11 మిల్లులను అధికారులు బృందాలుగా వెళ్లి తనిఖీ చేశారన్నారు. తహశీల్దార్లు, సిఎస్‌డిటిలతో సహా పలువురు కీలక అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొంటారని, మిల్లుల్లో ఎవరైనా అనధికార ధాన్యం నిల్వలు ఉంచారా లేదా అనే అంశంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామన్నారు. అయితే ఇప్పటి వకరూ తనిఖీ చేసిన ఏ మిల్లులోనూ అనధికార ధాన్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలతో పాటు భవిష్యత్తులో నిబంధనలు పాటించని వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుందని హెచ్చరించారు. మిల్లర్లు ఎవరైనా అనధికారికంగా రైతుల దగ్గర గానీ, మధ్యవర్తుల దగ్గర గానీ ధాన్యం సేకరించినా, నిల్వ చేసినా, వ్యాపార నిమిత్తం ధాన్యం కొనుగోలు చేసి బి -రిజిస్టర్‌లో పేర్కొనకపోయినా, వారిపై 6ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రభుత్వ పరంగా నిర్వహించే సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రోక్యూర్మెంట్ ఆపరేషన్లలో పాల్గొనే అవకాశం లేకుండా ఆ మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు.

వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని వరహాలుగెడ్డ అక్రమ రిజిస్ట్రేషన్ తక్షణమే రద్దు చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జెసికి, సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి, గెడ్డ లు, వాగులు రక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణం మధ్య గుండా ప్రవహిస్తున్న వరహాల గెడ్డ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారని, ఈ ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. వరహాల గెడ్డ సర్వేనెంబర్ 410కు సంబంధించిన గెడ్డ పోరంబోకు ప్రాంతాన్ని పూర్తిగా సర్వే జరపాలని, గెడ్డ ఎంత విస్తీర్ణంలో ఉండేదో హద్దులు నిర్ణయించాలని కోరారు. ఆక్రమిత గెడ్డ స్థలంలో నిర్మించిన శాశ్వత కట్టడాలను తొలగించాలని డిమాండ్ చేశారు. తూ తూ మంత్రంగా కంచె తొలగించడం వల్ల కొద్ది రోజులకు మళ్లీ అక్రమార్కులు ఆక్రమణలకు పాల్పడతారని గత చరిత్ర చెబుతోందని తెలిపారు. ఇప్పటికైనా సమగ్ర సర్వే నిర్వహించి, వరహాల గెడ్డ ఆక్రమణలు తొలగించాలని, తొలగించగా ఏర్పడిన ప్రభుత్వ భూమి ప్రజాఅవసరాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ వరహాల గెడ్డపై గల నిర్మాణాలకు సంబంధించి నోటీసులు జారీ చేశామని, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక చైతన్య వేదిక నాయకులు పాలక రంజిత్ కుమార్, సిపిఎం నాయకులు బివి రమణ, ఉమా, సూరిబాబు, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పోల రమణి, రెడ్ స్టార్ నాయకులు జీవ, సూరయ్య, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పి.సంగం, గ్రామీణ పేదల సంఘం నాయకులు బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ప్రక్షాళనపై జిల్లా యంత్రాంగం దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం

పరిశుభ్రత, మౌలిక వసతులపై తనిఖీ నివేదికలు తప్పనిసరని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ పరిశుభ్రంగా, మెరుగైన మౌలిక వసతులతో ఉండేలా చూసేందుకు ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు సోమవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీచేశారు. ప్రధానంగా కార్యాలయ ప్రాంగణాలు, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, అందుబాటులో ఉన్న పనికిరాని వస్తువులు, పాత ఫైళ్లను వెంటనే డిస్పోజ్ చేయాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. ప్రతి కార్యాలయంలో ఉద్యోగులు, ప్రజల వినియోగం కోసం మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించేందుకు వీలుగా, కార్యాలయాలు, పరిసరాల తాజా ఫొటోలు, వీడియోలను తీసి తక్షణమే జిల్లా అధికారుల ప్రత్యేక గ్రూపులో పంపాలని సూచించారు. మండల, గ్రామ కార్యాలయాల పనితీరును, పరిశుభ్రత ప్రమాణాలను వ్యక్తిగతంగా సమీక్షలు చేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఉన్నతాధికారులు తమ పరిధిలోని కార్యాలయాలను స్వయంగా పర్యటించి, పనితీరును పరిశీలించి, అవసరమైన సూచనలు అందించాలని, పర్యటనల అనంతరం పూర్తి వివరాలతో కూడిన క్షేత్ర స్థాయి పర్యటన నివేదికలను తక్షణమే జిల్లా కార్యాలయానికి పంపాలని, అంతే కాకుండా అన్ని శాఖల వారీగా ప్రస్తుతం అమలవుతున్న పనుల పురోగతిపై సమీక్షలు చేపట్టాలని పేర్కొన్నారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఉద్యోగోన్నతి ధ్రువపత్రాలు పొందిన అంగన్‌వాడీ వర్కర్లు

33 మంది మినీ అంగన్వాడీ వర్కర్లకు ఉద్యోగోన్నతి

ప్రజశక్తి - కురుపాం

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సేవలందిస్తున్న 33 మంది మినీ అంగన్వాడీ వర్కర్లకు మెయిన్ అంగన్వాడీ వర్కర్లగా ఉద్యోగోన్నతి లభించినట్లు సిడిపిఒ జి.రజిని దుర్గ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం పార్వతీపురంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సందర్భంగా గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చేతుల మీదగా పదోన్నతి పత్రాలను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పిడి కనకదుర్గ ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

స్కిల్ కాలేజీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసి స్కిల్ కాలేజ్‌లో ఉచిత కంప్యూటర్, ఇంగ్లీష్ శిక్షణ, ప్లేస్మెంట్ కోసం దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వైటిసి మిలీనియం ఇన్‌ఛార్జ్ జె.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎ పరిధిలో వైటిసి స్కిల్ కాలేజీలో 4నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కూడా కల్పిస్తామన్నారు. దీని కోసం ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన విద్యార్థులు అర్హులేనన్నారు. ఇంటర్‌నెట్ కలిగిన యువత డిసెంబర్ 1నాటికి వారి డాక్యుమెంట్లు తీసుకొని వైటిసికి రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6303464426, 9542778064 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

715 సారా ప్యాకెట్లు స్వాధీనం

పార్వతీపురం : మండలంలోని లచ్చిరాజుపేటలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో సోమవారం 715 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు పార్వతీపురం సిఐ ఎస్.శిరీష ఆధ్వర్యాన నిర్వహించిన దాడుల్లో ఆ గ్రామానికి చెందిన కంట సింహాచలం అలియాస్ డేవిడ్‌ను అరెస్టు చేశారు.

మోసూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని మోసూరులో సోమవారం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ పిఎసిఎస్ అధ్యక్షులు సింహాచలం, చల్ల కనకబాబు, పూసర్ల నర్సింగరావు, కొత్తల పోలినాయుడు, వ్యవసాయ శాఖ అధికారి కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ సూర్యనారాయణ

పెద భోగిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సీతానగరం : మండలంలోని పెదబోగిలి కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ధాన్యాన్ని నేరుగా రైతు సేవా కేంద్రాలకు తెచ్చుకోవచ్చన్నారు. ఇప్పటికే గాజులవలస, జానుమూలవలస, ఆర్.వెంకంపేట, కోట సీతారాంపురం, నిడగల్లు, కాశీపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సర్పంచ్ తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె అరవింద్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు బి.సూర్యనారాయణ, టిడిపి నాయకులు డి.పెద్దబ్బాయి, ఎస్.హరి గోపాలరావు, పెదబోగిలి పిఎసిఎస్ పర్సనల్ ఇన్‌ఛార్జి విజయ్ కుమార్ సొసైటీ మానిటరింగ్ ఆఫీసర్ సిహెచ్ లక్ష్మి, సిఇఒ కె.శ్రీనివాసరావుతో పాటు టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపిడిఒ జె. ఉమామహేశ్వరి అన్నారు. మండలంలో నీలకంఠపురం గిరిజన సంక్షేమ ఆశ్రమం ఉన్నత బాలుర పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులు విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలు పరిశీలించి రుచి చూశారు. అనంతరం ముస్తాబు కార్యక్రమం గూర్చి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుని విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగుపరుచుకోవడానికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఉమామహేశ్వరి

విజేతలను అభినందిస్తున్న నాయకులు

కరాటే, కిక్ బాక్సింగ్‌లో విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళంలో ఈనెల 23న జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే, కిక్ బాక్సింగ్ పోటీల్లో స్థానిక విలేకరులతో బంగారు పతకాలు సాధించారు. పెద్దగూడ పంచాయతీ అచ్చబ గ్రామానికి చెందిన విద్యార్థులు కె.దీపక్ ఫైటింగ్, హర్ష కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. వీరిని పీసా అధ్యకులు నిమ్మక నాగేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, కోచ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయ అనుబంధ సంఘాలతో సర్వేలు

ప్రజాశక్తి - సీతానగరం

వ్యవసాయశాఖ అనుబంధ సంఘాలతో అన్ని గ్రామాల్లోనూ సర్వేలు ప్రచారం చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మండలంలోని పెదభోగిలి, బుడ్డిపేటలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి సందేశాన్ని వివరిస్తూ వ్యవసాయ భద్రత, పథకాలు గురించి వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 3వరకు జరుగుతుందన్నారు. తద్వారా గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో కుమార్, సచివాలయం సిబ్బంది, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: ఈనెల 24 నుంచి 29 వరకు రైతుల అవగాహన కార్యక్రమాల కోసం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎఒ కె.శిరీష తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని నెల్లిపర్తి, బంగారమ్మపేటలో వ్యవసాయాధికారులతో కలిసి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఏకపంట విధానం కాకుండా బహుళ పంటలను పండించి గట్లపై కూడా కూరగాయలను, కంది పండించుకున్నట్లయితే అధిక ఆదాయాన్ని పొందుతారని ఆమె తెలిపారు వ్యవసాయ శాఖ సిబ్బంది వాటి అనుబంధ సిబ్బంది రోజుకు 30 క్లస్టర్లకు మూడు రైతు సేవ కేంద్రాల పరిధిలో ఉండే రైతులను కలిసి రైతులకు వివిధ రకాల పంటలు రైతులకు అందే పథకాలను గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని ఆరు రోజులపాటు రైతన్న కోసం 17 సచివాలయాల్లో రైతు సేవా కేంద్రాల వద్ద కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్.భారతి అన్నారు. సోమవారం ఎ.వెంకంపేట రైతు సేవా కేంద్రం వద్ద మండల టిడిపి అధ్యక్షులు జి వేణు గోపాలనాయుడు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : పెదబోగిలిలో ప్రచారం చేస్తున్న వ్యవసాయాధికారి అవినాష్

పాచిపెంట : పంచ సూత్రాలతో రైతుల అభివృద్ధికి ఇంటింటా రైతుల సర్వే నిర్వహించి రాబోయే మూడు సీజన్లకు వ్యవసాయ ప్రణాళికను రూపొందించే లక్ష్యంగా రైతన్న మీకోసం కార్యక్రమం ఉపయోగపడుతుందని సాలూరు ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మోసూరులో రైతుల సర్వే కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ నీటి వనరుల సద్వినియోగం అభివృద్ధి, అధిక డిమాండ్ కలిగిన పంటల అభివృద్ధి, వ్యవసాయంలో సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ప్రభుత్వ పథకాల అమలుపై ఐదు పంచ సూత్రాలతో రైతులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఇంటింటి సర్వే సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని, దీన్ని రైతులంతా తమ భూముల ఆరోగ్యాన్ని, పంటలను కాపాడుకుంటూ ఖర్చులు తగ్గిస్తూ దిగుబడులు పెంచే దిశగా సూచనలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాంచాలి సర్పంచ్ యుగంధర్, పిఎసిఎస్ చైర్మన్ సింహాచలం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పి.నరసింగరావు, మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

డివైడర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి...పార్వతీపురం టౌన్.

పట్టణంలోని బెలగాం గెడ్డవీధి నుంచి వైకెఎం కాలనీ వరకు డివైడర్లు లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కావున తక్షణమే డివైడర్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎన్. కలెక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్ తదితరులు పార్వతీపురంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త జిల్లా ఏర్పడ్డాక పార్వతీపురంలో ట్రాఫిక్ పెరిగిందన్నారు. ముఖ్యంగా వైకెఎం కాలనీలో జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు ఉండడంతో విపరీతమైన రద్దీ నెలకొంది అన్నారు. బెలగాం గెడ్డ వీధి నుండి వైకెఎం కాలనీ వరకు గల మెయిన్ రోడ్డు ఇటీవల రద్దీగా మారిందన్నారు. ఆ రోడ్డులో సెంటర్ డివైడర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు తెలిపారు. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతుండగా మరికొంతమంది అంగవైకల్యం చెందుతున్నారన్నారు. దీంతో పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. తక్షణమే ఆ రోడ్డులో సెంటర్ డివైడర్లు ఏర్పాటు చేయాలన్నారు.

అలాగే ఇటీవల మెయిన్ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురవుతోందన్నారు. దీనివల్ల రోడ్డు ఇరుగ్గా మారి ప్రమాదాలకు కారణం అవుతుందన్నారు. పట్టణ మెయిన్ రోడ్డు లోని రాయగడ రోడ్డు నుండి వైకెఎం కాలనీ వరకు గల ఆక్రమణలను తొలగించాలని,. అలాగే జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు..